www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
గురువారం
27 మార్చి 2025

విలేఖరులు కావలెను



కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రజకీయాలు, సామాజిక అంశలపై అవగాహన ఉండి.. రియగల వరికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003



## తెలంగాణతో సిస్కో ఒప్పందం

**స్కిల్ యూనివర్సిటీలో నైపుణ్య శిక్షణపై అగ్రిమెంట్**

**సీఎం రేవంత్‌రెడ్డితో కలిసిన సిస్కో ప్రతినిధి బృందం**

కలంజ్యోతి, హైదరాబాద్ : దక్షిణ ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ సాఫ్ట్ వేర్ కంపెనీ సిస్కో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండటంతో సీఎం రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నారు. దాంతో ప్రీమియర్ ఆఫ్ సౌత్ ఆస్ట్రేలియా పీటర్ మాలినాస్కస్ ఎంపీ నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం బుధవారం సీఎం రేవంత్ ను అసెంబ్లీ కమిటీ హాల్లోనే కలిసింది. ఆయన సమక్షంలో ఇరు దేశాల అధికారులు సంతకాలు చేశారు. స్కిల్ యూనివర్సిటీలో నైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రభుత్వంతో సిస్కో, టాస్క్ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. దాంతో సాంకేతిక రంగంలో దిగ్గజ సంస్థ సిస్కో నైపుణ్య శిక్షణ అందించడంలో తెలంగాణలోని ప్రతిష్టాత్మక యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో కలిసి పని చేయనున్నది. నైపుణ్య శిక్షణ అందించే విషయంలో సిస్కోకు స్కిల్స్ యూనివర్సిటీకి, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ కు మధ్య వేర్వేరు ఒప్పందాలు కుదిరాయి.ఈ సమావేశంలో ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ ఓఏఎం, మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, స్కిల్స్ యూనివర్సిటీ వైఎస్ ఛాన్సలర్ వీఎల్వీఎస్ఎస్ సుబ్బారావు, టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## కొండగట్టు అంజన్న హుండీ లెక్కింపు

కలంజ్యోతి, మల్యాల : కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో 55 రోజులకు గాను 12 హుండీలను లెక్కించగా కార్యనిర్వహణాధికారి శ్రీకాంత్ రావు పర్యవేక్షణలో శ్రీలలితా సేవా ట్రస్ట్ సభ్యులు బుధవారం పాల్గొన్నారు. హుండీ ఆదాయం రూ.1,09,13,339 నగదు, 109 విదేశీ కరెన్సీ లభించినట్లు అధికారులు తెలిపారు. అలాగే వచ్చిన వెండి, బంగారంను ఒక బ్యాగ్ లో వేసి సీల్ చేసి తిరిగి హుండీలో భద్రపరిచినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కరీంనగర్ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ, స్థానిక ప్రధాన అర్చకులు, అర్చకులు, బ్యాంక్ అధికారులు, ఆలయ పర్యవేక్షణ అధికారి సునీల్, సిబ్బంది, మహిళా కానిస్టేబుల్స్, హోంగార్డులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## జోరుగా అక్రమ నిర్మాణాలు

- మల్లంపేట్ లో బాలాజీ ఎన్ క్లేవ్ లో అనుమతి లేకుండా ఆకాశ హర్మ్యాలు
- కన్నెత్తి చూడని అధికారులు
- కమిషనర్ ఉన్నట్టా? లేనట్టా?
- దుండిగల్ మున్సిపల్ లో రబ్బరు స్టాంప్ లా అధికారులు
- చక్రం తిప్పుతున్న చైన్ మెన్ లు
- ముడుపులు అందరికి అందుతున్నాయా?
- చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

2లో



2 కలంజ్యోతి
గురువారం 27.03.2025 General News

# జోరుగా అక్రమ నిర్మాణాలు

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేట్ లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా భహుళ అంతస్థుల నిర్మాణాలు చేపడుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చూసి చూడనట్టుగా వదిలేస్తున్నారు. ప్రధానం గా బాలాజీ లే అవుట్ లో ఓ నిర్మాణదారుడు ఎక కాలంలో, ఓకే ప్రాంతంలో మూడు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా చర్యలు తీసుకోవడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారు.

**తానా.. అంటే తందాన!**

ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ కిందిస్థాయి అధికారులను తన చెప్పు చేతల్లో ఉంచుకొన్న నిర్మాణదారులు అడ్డగోలుగా నిబంధనలు అతిక్రమిస్తుంటే ఉన్నత అధికారులు సైతం తానా అంటే తందాన అన్నటుగా విధులు నిర్వహిస్తున్నారని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. సాధారణ ప్రజలపై ఒకలా బడా బాబులకు ఒకలా చట్టాన్ని ఉపయోగిస్తూ దుండిగల్ మున్సిపల్ అధికారులు ప్రజా విమర్శలు ఎదుర్కొంటున్నారు.

**ఎందుకింత నిర్లక్ష్యం?**

కేవలం స్థానికంగా విధులు నిర్వహించే చైన్ మెన్ ఇచ్చే సమాచారం ఆధారంగా టౌన్ ప్లానింగ్ అధికారులు విధులు నిర్వహిస్తున్నారా? లేదంటే సదరు నిర్మాణదారులతో ఏదన్నా ఒప్పందం కుదుర్చుకున్నారా? ఏమోకానీ మల్లంపేట్ బాలాజీ లే అవుట్ లో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ఈ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి విధుల్లో చేరిన మొదట్లో హడావుడి చెసి తదనంతరం తన వాటా తనకు వస్తే చాలు అన్నట్టుగా క్షేత్రస్థాయిలో పర్యటించకుండా మమ అనిపిస్తున్నారని, దాంతో అక్రమ నిర్మాణాలకు సక్రమంగా గ్రీన్ సిగ్నల్ పడ్డట్టు అవుతుందని ఈ ప్రాంత ప్రజలు భాహటంగా చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.









# అక్రమ నిర్మాణాలను పట్టించుకోరా?

### ప్రగతి నగర్ అక్రమ నిర్మాణంపై మల్యాల రమణి ఫిర్యాదు

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్, నిజాంపేట్, బాచుపల్లి ప్రాంతాల్లో మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులకు మించి అక్రమ కట్టడాలు జరుగుతున్నా పట్టించుకునే వారే లేరా? అని నిజాంపేట్ ఆశాజ్యోతి ఉమెన్ నెట్వర్క్ అధ్యక్షురాలు రమణి మల్యాల ప్రశ్నించారు. ప్రధానంగా ప్రగతినగర్ వార్డు పరిధిలోని గ్రీన్ బావార్చి వెనుకాల సర్వే నెంబర్ 149, ప్లాట్ నంబర్ 96లో ప్రభుత్వ విభాగంలో పనిచేస్తున్న ఓ ప్రభుత్వ ఉద్యోగి తెలంగాణ మున్సిపల్ చట్టం నిబంధనలను తుంగల్లో తొక్కి, స్టిల్ +2 అనుమతులు తీస్కొని స్టిల్ +5 నిర్మాణాలు చేపడుతున్నారు. ఇలాంటి అక్రమ కట్టడాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 25న ఆమె నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కు పిర్యాదు చేశారు. పిర్యాదు చేసి కనీసం మూడు రోజులు గడుస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలకు ముందుకు రాకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. కావున ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందించి అనుమతులకు మించి పుట్టగొడుగులా పుట్టాకొస్తున్న అక్రమ కట్టడాలపై వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా ఆమె డిమాండ్ చేశారు.





# ఇఫ్తార్ విందులో కలెక్టర్

**కలంజ్యోతి, నిర్మల్ :** పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ లతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. వివిధ జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి విందును స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలంతా అన్ని పండుగలను కలిసికట్టుగా సోదర భావంతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని మతాల సారం ఒకటేనని, ప్రజలంతా కలిసికట్టుగా ఉంటూ దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. సమాజ సేవ, దయాగుణం వంటి మంచి లక్షణాలను అలవర్చుకోవాలని తెలిపారు. ముస్లింలకు ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రత్న కళ్యాణి, జిల్లా అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన కలెక్టర్

**కలంజ్యోతి, జగిత్యాల :** రాష్ట్ర బీసీ కమిషన్ బీసీ కమిషన్ చైర్మన్ జీ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్ జిల్లా పర్యటనకు రాగా, కలెక్టర్ సత్య ప్రసాద్ బుధవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషన్ చైర్మన్, సభ్యులు జగిత్యాల లో గురువారం పర్యటించనున్న నేపథ్యంలో వారు మెడికల్ కాలేజీ గెస్ట్ హౌస్ కు చేరుకోగా, కలెక్టర్ వారికి పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు.



# కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం

### ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా పకడ్బందీగా చర్యలు
### కలెక్టర్ బి.సత్యప్రసాద్



**కలంజ్యోతి, జగిత్యాల :** కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీన పరచుకుని, ఇకపై ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో అక్రమనకు గురైన 90 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ స్థలాన్ని సందర్శించి సర్వే నెంబర్లు వ్యూ పాయింట్స్ చెక్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ .. జగిత్యాల జిల్లా రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో సర్వే నెంబర్ 251, 437, సర్వే నెంబర్ కు సంబంధించి 90 ఎకరాల్లో ప్రభుత్వ అసైన్ ల్యాండ్ కు సంబంధించిన సర్వే చేపట్టడం జరిగిందన్నారు. సర్వే తర్వాత ఏవైతే పట్ట అయినా భూములు ఉన్నాయో అవి అన్నీ కూడా పీఓటీ యాక్ట్ రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. దీంతో 90 ఎకరాల్లో ఉన్న ప్రభుత్వ స్థలం ఆన్ రికార్డు పరంగా గవర్నమెంట్ రికవరీ చేసుకుందన్నారు. ఇప్పటి వరకు భూమిని ఆక్రమించిన వారు 48 గంటల లోపు ఖాళీ చేయమని ఆదేశాలు జారీ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వ పీఓటీ యాక్ట్ ప్రకారం ప్రభుత్వ స్థలంలో వారు వ్యాపారాలు చేసుకున్నందుకు గానూ వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కలెక్టర్ వెంట ఇన్చార్జి ఆర్డీవో శ్రీనివాస్, ఎమ్మార్వో శ్రీనివాస్, రూరల్ మండల్ డీఐఓ ల్యాండ్ సర్వేయర్ విఠల్, సంబంధిత అధికారులు ఉన్నారు.



## గౌరవెల్లి రిజర్వాయర్ కాల్వల నిర్మాణానికి భూ సేకరణ

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** గౌరవెల్లి ప్రాజెక్టు కొరకు మండలంలోని కెనాల్స్ భూసేకరణ కోసం బుధవారం ముత్తారం గ్రామంలో రైతులతో నీటిపారుదల డిప్యూటీ ఈఈ చైతన్య, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓ రమేష్ రాథోడ్ హాజరు అయ్యారు. ముందుగా ఆర్ ఐ శ్రీధర్ భూములు కోల్పోయే రైతుల పేర్లను చదివి వినిపించారు. అనంతరం ఆర్డీవో రమేష్ రాథోడ్ మాట్లాడుతూ, గౌరవెల్లి రిజర్వాయర్ నుంచి నీటి పంపిణీ ప్రక్రియకు సంబంధించిన మెయిన్ కెనాల్ నుంచి ఆయా గ్రామాలకు అందించేందుకు వీలుగా డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ నిర్మించేందుకు కావలసిన భూసేకరణ కోసం ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలుపాలని రైతులకు సూచించారు. కరీంనగర్ నీటిపారుదల అధికారి చైతన్య మాట్లాడుతూ, భవిష్యత్తులో కాలువల వల్ల జరిగే ప్రయోజనాలను వివరిస్తూ, భూ సేకరణకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో భూ సేకరణ అధికారి రాజ్ కుమార్, ఆర్.ఐ లు శ్రీధర్, రాజు, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఎస్సై ప్రవీణ్ కుమార్, వంగర ఎస్సై దివ్య, గ్రామపంచాయతీ సెక్రటరీ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మాణిక్యాపూర్ లో సేంద్రియ ఎరువులపై అవగాహన సదస్సు

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** మండలంలోని మాణిక్యాపూర్ గ్రామంలో డబ్ల్యూడబ్ల్యూఎఫ్ నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ, జీవ సంబంధిత రసాయనాలను మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా బిసిఐ ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ మహేందర్ మాట్లాడుతూ, రైతులు భూసార పరీక్షలు నిర్వహించి, వాటి ఫలితాల ఆధారంగా సరైన ఎరువులు, సరైన మోతాదులో, సరైన సమయంలో, సరైన ప్రదేశంలో వాడుకోవాలని రైతులకు సూచించారు. నేలలో సేంద్రియ కార్బనం పెంపొందించే పద్ధతులను అవలంబించాలని, రసాయన పురుగు మందులను తగ్గిస్తూ, జీవ రసాయన ఎరువులను వాడుకోవాలని ఉన్నారు. అనంతరం ప్రాజెక్ట్ మేనేజర్ సింధురెడ్డి, బీసీఐ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బొట్ల సతీష్ కుమార్ మాట్లాడుతూ, రైతులు వాడే రసాయనాల మందుల వల్ల రాబోయే కాలంలో భూమి నిస్సారం అవుతుందని కాబట్టి రైతులు రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల ఉత్తమ రైతులు, నవక్రాంతి పాలకవర్గ సభ్యులు, బీసీఐ క్షేత్ర సిబ్బంది, 150 మంది గ్రామ రైతులు ఉన్నారు.





## గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్

**కలంజ్యోతి, గీసుగొండ :** జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలో ప్రతి గ్రామంలో పాదయాత్రలు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మలపల్లి శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ ఆకుల రుద్రప్రసాద్, పత్తిపాక రవీందర్. మణిగోపాల్, కూసం రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో అమలు చేయాలు చేసేందుకు కలిసి కట్టుగా కార్యాచరణలో భాగస్వామ్యం కావాలన్నారు. అనంతరం 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' పీఠికను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి భీమగాని సౌజన్య, పరకాల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చాడ కొమరారెడ్డి, గీసుగొండ మండల మహిళా అధ్యక్షురాలు సరిత, మండల నాయకులు కొమ్ము శ్రీకాంత్, ఎస్సీ సెల్ అధ్యక్షులు గొర్రె రాజు, బీసీ సెల్ అధ్యక్షుడు వజ్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగారం స్వామి, ఉపాధ్యక్షులు జన్ను రమేష్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నరేష్ శ్రీనివాస్, వినయ్, ఆయా గ్రామాల అధ్యక్షులు నల్ల సురేష్, దౌడు ప్రవీణ్, యుగంధర్, రమేష్, రవీందర్, భద్రునాయక్, ప్రవీణ్, రాజన్న, రమేష్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు దౌల్తాబాద్ లో తైబజార్ వేలం



**కలంజ్యోతి, నర్సాపూర్ :** హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ గ్రామంలో తై బజార్ వేలాన్ని ఈ నెల 27న గురువారం ఉదయం 11 గంటలకు గాంధీచౌక్ వద్ద నిర్వహించనున్నట్లు దౌల్తాబాద్ ఈవో మజార్ అలీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేలానికి ఆస్తికి గల్ల అభ్యర్థులు రూ.50వేలు డిపాజిట్ సమర్పించాలని సూచించారు. ఆస్తికి గల వారు హాజరు కావాలని ఈవో కోరారు.



## ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు అందించాలి

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** గ్రామాల్లో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు వెంటనే వేతనాలు అందించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు గుగులోతు రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నల్ల శ్రీవాణికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలుగా వేతనాలు అందించకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలను అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట సంఘం మండల ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, సలహాదారులు జంపాల రాజయ్య, మర్రి సురేష్, శ్రీలత, తప్పేట రమేష్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.



## దళితుడి భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మార్పీఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మైసగల్ల బుచ్చేంద్ర మాదిగ

**కలంజ్యోతి, నర్సాపూర్ :** నర్సాపూర్ నియోజకవర్గంలోని హత్నూర మండల పరిధిలోని కొన్యాల గ్రామానికి చెందిన గంధగల్ల ప్రసాద్ అదే గ్రామానికి చెందిన జుట్టు నర్సింలు, జుట్టు వీరేశం ముదిరాజ్ వీరు పెద్దమనుషుల సమక్షంలో భూమి బదలాయింపు కింద గంధగల్ల ప్రసాద్ మూడు గంటల భూమి మామిడి చెరువు కింద మాదారం శివారులో జుట్టు నర్సింలు భూమి పక్కన ఉన్నందున ఆ మూడు గంటలు తనకు రాసిఇస్తే కొన్యాల గ్రామ శివారులోని కాంచన చెరువు కింద రెండు గంటలు బదులుగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తానని పెద్దమనుషుల సమక్షంలో ఒప్పందం చేసుకొని రాసుకున్నారు. దీంతో గంధగల ప్రసాద్ జుట్టు వీరేశం పైన మూడు గంటల భూమి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చాడు. అప్పటినుంచి ఇప్పటివరకు గంధగల ప్రసాద్ కు ఇస్తానన్న రెండు గంటల భూమిని ఇవ్వలేదు. ఈ విషయమై అడిగితే 'దిక్కున్నా కాడ చెప్పుకోండి.. నేను భూమిని రాసివ్వను' అని దౌర్జన్యంగా మాట్లాడుతున్నాడని ఈ విషయంపై హత్నూర పోలీస్ స్టేషన్లో వారిద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాల్సిందిగా ఫిర్యాదు చేశారు. గంధగల్ల ప్రసాద్ రావాల్సిన రెండు గంటల భూమిని వెంటనే రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని, ఈ విషయమై చట్టరీత్యా చర్యలు తీసుకొని, బాధ్యుడికి న్యాయం చేయాలని సంఘం నాయకులు కోరారు. కార్యక్రమంలో దళిత నాయకులు శాంత కుమార్, గంధగల్ల వీరయ్య, నల్లోల్ల మొగులయ్య, రాజు పాల్గొన్నారు.

## మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

సూపరింటెండెంట్ ఇంజనీర్ సాలియా నాయక్

**కలంజ్యోతి, జగిత్యాల:** వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించే లక్ష్యంగా కృషి చేస్తున్నామని సూపరింటెండెంట్ ఇంజనీర్ సాలియా నాయక్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో జగిత్యాల సర్కిల్ పరిధిలో కెపాసిటర్ బ్యాంకులు 115 పెట్టినట్లు తెలిపారు. ఇప్పటివరకు లైన్ లలో కెపాసిటర్ బ్యాంకులు 41 పెట్టినట్లు ఉండగా వోల్టేజ్ లో హెచ్చుతగ్గులు లేకుండా ఎంతగానో కెపాసిటర్ బ్యాంకులు ఉపయోగపడుతాయన్నారు. కెపాసిటర్ బ్యాంకులతో స్టేషన్ , లైన్లలో విద్యుత్ సరఫరాలో ఓవర్ లోడ్ కాకుండా నియంత్రిస్తున్నదన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు, పారిశ్రామిక ఫీడర్లకులో వోల్టేజ్ వలన మోటార్లు కాలిపోకుండా ఉండేందుకు కెపాసిటర్ బ్యాంకులు దోహదపడుతాయన్నారు. విద్యుత్ సరఫరా వ్యవస్థలో రీయాక్టివ్ పవర్ కాంపన్సేషన్ ద్వారా పవర్ ఫ్యాక్టర్ ఘననీయంగా మెరుగు పరచడానికి కెపాసిటర్ బ్యాంకులు దోహద పడుతున్నాయన్నారు. పరికరాల మన్నిక కూడా చాల కాలం పెరుగుతుందన్నారు. పారిశ్రామిక వినియోగదారులకు కెపాసిటర్లు పెట్టుకోవడానికి ప్రోత్సహిస్తున్నామన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించే దిశగా పనిచేస్తున్నామన్నారు.




## పాఠశాలకు ప్రింటర్ అందజేత

**కలంజ్యోతి, గీసుకొండ :** మండలంలోని ఎల్కుర్తి హవేలికి చెందిన జెడ్పీహెచ్ పాఠశాల 198485 బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థులు 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వారు చదువుకున్న పాఠశాలకు జిరాక్స్ ప్రింటర్ స్కూల్ కు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

### నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్ అభిలాష



**కలంజ్యోతి, నిర్మల్ :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం సాయంత్రం ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న నమూనా ఇందిరమ్మ ఇంటిని కలెక్టర్ సందర్శించి, నిర్మాణ పనులను పరిశీలించారు. హౌస్ డిజైన్, ప్రజలకు అందుబాటులో ఉండే సౌకర్యాలపై అధికారులకు కీలక సూచనలను చేశారు. నిర్మాణ నాణ్యతను మెరుగు పరచాలని, పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను సమకూర్చాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇండ్లు లేని పేదవారికి ఇండ్లను అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మఇండ్లపథకాన్నితీసుకువచ్చిందన్నారు. అన్ని మండలాల్లో నిర్మించనున్న నమూనా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుదారుల సర్వే కొనసాగుతున్నదని, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్షిస్తూ, పట్టణ పరిధిలో ఆస్తిపన్ను వసూలు వంద శాతం పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ను కలెక్టర్ ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ కు ఈ నెల 31 వరకు గడువు ఉన్నందున దరఖాస్తుదారులు 25 శాతం లబ్ధి పొందేలా ఎల్ఆర్ఎస్ పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వాగులు, నది పరివాహక ప్రాంతాలలో ఇసుక రీచ్ లను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రెవెన్యూ, పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో సునీత, ఎంపీఓ రత్నాకర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


## అప్సర హత్య కేసులో పూజారికి జీవిత ఖైదు

**కలంజ్యోతి, హైదరాబాద్:** హైదరాబాద్ సరూర్ నగర్ లో యువతి అప్సర హత్య కేసులో రంగారెడ్డి కోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఈ కేసులో నిందితుడు పూజారి సాయి కృష్ణకు జీవిత ఖైదు విధిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పునిచ్చింది. వెంకట సూర్య సాయికృష్ణ మైసమ్మ దేవాలయంలో పూజారిగా పనిచేసేవాడు. పూజారి పనులతో పాటు కాంట్రాక్టర్ గా పని చేసేవాడు. చెన్నై కి చెందిన కురుగంటి అప్సర (30) తన తల్లితో కలిసి ఇదే కాలనీలో నివాసం ఉండేది. అయితే అప్సర పలు సినిమాలు, సీరియల్స్ లలో చిన్న చిన్న పాత్రలలో నటిస్తూ ప్రైవేట్ ఉద్యోగం చేసేది. ఈ క్రమంలో పూజారి సాయికృష్ణ పనిచేసే మైసమ్మ ఆలయానికి అప్సర వస్తుండేది. సాయికృష్ణ, అప్సరల పరిచయం కాస్త ప్రేమగా మారి వివాహేతర సంబంధానికి దారి తీసింది. దాంతో తనను పెళ్లిచేసుకోవాలని సాయికృష్ణను అప్సర ఒత్తిడి చేసేది. ఒత్తిడి తట్టుకోలేక ఎలాగైనా అప్సరను వదిలించుకోవాలని పూజారి సాయికృష్ణ పథకం రచించాడు. 2023 జూన్ 3న కోయంబత్తూరు పోదామని చెప్పి అప్సరను కారులో తీసుకుని వెళ్లాడు. అదేరోజు రాత్రి 11 గంటల సమయంలో శంషాబాద్ మండలం సుల్తాన్ పల్లి లోని గోశాల సమీపంలోని సీసీ కెమెరాలు లేని ప్రదేశానికి తీసుకెళ్లి అప్పటికే నిద్రపోతున్న అప్సర ముఖంపైన కారుపై కప్పే కవర్ తో ఊపిరి ఆడకుండా చేస్తుండగా అప్సర ప్రతిఘటించింది. వెంట తెచ్చుకున్న బెల్లం కొట్టే రాయితో తలపై కొట్టడంతో.. అక్కడికక్కడే మృతి చెందింది. అప్సర మృతదేహాన్ని కారు బాడీ కవర్ లో చుట్టి డిక్కీలో వేసుకొని తన ఇంటివద్దకు వచ్చాడు. మృతదేహం నుంచి దుర్వాసన రావడంతో




సరూర్ నగర్ తహశీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న డ్రైనేజీ మ్యాన్ హోల్ లో పడేశాడు. అప్సర తల్లి తన కూతురు గురించి ప్రశ్నించగా .. స్నేహితులతో కలిసి భద్రాచలం వెళ్లిందని తానే శంషాబాద్ లో ఆమె స్నేహితుల కార్ లో ఎక్కించినట్లు నమ్మబలికాడు. తరువాత పలుమార్లు ఫోన్ చేసిన స్పందించలేదని చెప్పాడు. ఏమీ తెలియనట్టు తల్లితో కలిసి శంషాబాద్ ఆర్ జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్కడి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సాయికృష్ణ మాట్లాడే మాట తీరుపై అనుమానం కలిగి పోలీసులు అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా నేరాన్ని అంగీకరించాడు. ఈ కేసుపై విచారణ జరిపిన రంగారెడ్డి జిల్లా 11వ అడిషనల్ సెషన్స్ జడ్జి జయప్రసాద్ నిందితుడు సాయి కృష్ణకు జీవిత ఖైదు విధించారు. మృతురాలి కుటుంబానికి 10 లక్షల నష్టపరిహారం అందిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి. రవికుమార్ తమ వాదనలు వినిపించారు.

# 6నుంచి శ్రీపంచముఖి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు



**గీసుగొండ ఆంజనేయస్వామి ఆలయ ప్రధాన అర్చకులు జగార్లపూడి అయ్యప్పశర్మ**



**కలంజ్యోతి, గీసుకొండ :** హనుమదీక్ష మాలధా రణ మహోత్సవాలు ఏప్రిల్ 6నుంచి ప్రారంభం కానున్నట్లు గీసుగొండ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు జగార్లపూడి అయ్యప్పశర్మ తెలిపారు. వచ్చే నెల 6వ తేదీ ఆదివారం శ్రీసీతారాముల కళ్యాణం నిర్వ హించనున్నట్లు తెలిపారు. మే 22న వైశాఖ దశమి హనుమాన్ బ్రహ్మోత్సవం రోజున ఉద యం 6గంటలకు స్వామివారికి పంచామృత నవ రసాభిషేకం నిర్వహిస్తామన్నారు. ఈ కార్య క్రమానికి శ్రీశ్రీ మఠాధిపతుల శ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి వారు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు అయ్యప్పశర్మ వెల్లడించారు.

**మాలాధారణలు..**

తెలుగు సంవత్సరాది ఉగాది ఈ నెల 30వ తేదీ ఏప్రిల్ 12వ తేదీ వరకు 41 రోజుల మండల దీక్ష తీసుకోవచ్చాని అయ్యప్పశర్మ తెలిపారు. 21 రోజుల అర్ధ మండల దీక్ష ఏప్రిల్ 28 నుంచి మే 02 తేదీ వరకు.. 11 రోజుల ఏకాదశ దిన దీక్ష మే 08 నుంచి మే 12 తేదీ వరకు మాలధారణ చేయనున్నట్లు వివరించారు. మే 17న శనివారం మౌనవ్రతం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందన్నారు. మే 22 వైశాఖ దశమి గురువారం శ్రీహనుమాన్ జన్మ ఉత్సవం ఉదయం 3 గంటలకు సుప్రభాత సేవ, 4 గంటలకు స్వామివారికి నవ రసాభిషేకం, 5 గంటలకు హనుమాన్ దీక్షలు విరమణలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉదయం 7:30కు పూర్ణాహూతి మహిధ శిర్వాచనం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, మహా అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు అయ్యప్పశర్మ వివరించారు.




## జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖకు
# అవార్డుల పంట

**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థకు రెండు రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయి. బుధవారం హైదరాబాదు గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో శ్రీనిధి 12వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ 202324 ఆర్థిక సంవత్సరానికి గానూ, శ్రీనిధి రుణాల వసూలు 88 శాతం, క్రెడిట్ ప్లాన్ లక్ష్య సాధన లో 105 శాతం లక్ష్యాలను సాధించి ఉత్తమంగా నిలిచినందుకుగాను రాష్ట్రంలోనే రెండవ స్థానం అవార్డు లభించింది. లోకేశ్వరం మండలం ప్రగతి మండల సమాఖ్యకు ఉత్తమ మండల సమాఖ్యగా రాష్ట్రంలో రెండు స్థానం దక్కింది. కాగా జిల్లాకు వరుసగా నాలుగో సంవత్సరం అవార్డు లభించింది. ఈ అవార్డులను డిఆర్డిఓ తరపున జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు గంగమణి, ప్రగతి మండల సమాఖ్య అధ్యక్షురాలు సాగర, ఎపిఎం మల్లేష్ లు రాష్ట్ర పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డి.అనసూయ సీతక్క, చేతుల మీదుగా అందుకున్నారు.

# గుండెపోటుతో టీచర్ మృతి



**కలంజ్యోతి, మల్యాల :** మండల కేంద్రంలోని శ్రీవాగ్దేవి ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో ప్రైవేట్ టీచర్ గా విధులు నిర్వహిస్తున్న బోగ అనురాధ (45) బుధవారం స్కూల్లో పిల్లలకు పాఠాలు బోధిస్తుండగానే గుండెపోటు రావడంతోనే అక్కడనే కుప్పకూలింది. వెంటనే తోటి ఉపాధ్యాయులు ఆమెను జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు.

# ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించాలి

## ఎస్పీ అశోక్ కుమార్



**కలంజ్యోతి, జగిత్యాల :** ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ప్రమాదాల నివారణలో బాగస్వాములు కావాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. బుధవారం మహిళలు, వృద్ధులు, ప్రయాణికులు సురక్షిత ప్రయాణం, భద్రత కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'MY AUTO IS SAFE' అనే కార్యక్రమాన్ని మెట్ పల్లి పట్టణంలో ఎస్పీ అశోక్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... మహిళలు, వృద్ధులు, ప్రయా ణికుల సురక్షిత, భద్రత కొరకు మై ఆటో సేఫ్ కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. జగిత్యాల జిల్లాలో 4000 లకు పైగా ఆటోలు ఉన్నాయని ఇప్పటి వరకు 2500లకు పైగా ఆటోలకు క్యూఆర్ కోడ్ తో అనుసంధానం చేయడం జరిగిందన్నారు. రాబోవు రోజుల్లో మిగతా ఆటోలో కూడా ఈ యొక్క స్టిక్కరింగ్ వేయడం జరుగుతుందన్నారు. మెట్ పల్లి పట్టణంలో సుమారు 346 ఆటో లకు (ఆటో ముందు, వెనక, డ్రైవర్ సీట్ వెనకాల ప్రయాణికులకు కనిపించే విధంగా) స్టిక్కరింగ్ చేయడం జరిగిందని ప్రయాణికులు ఎవరైనా ఆటోలో ప్రయాణించే ముందు మొదటగా ఆ ఆటోకు 'MY AUTO IS SAFE' అనే స్టిక్కరింగ్ ఉందా అని గమనించాలని సూచిం చారు. ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు ఏదేనా సమస్య ఎదురైతే ఆటో డ్రైవర్ సీట్ వెనకాల గల క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసిన వెంటనే అట్టి ఆటో డ్రైవర్ కు సంబంధించిన పూర్తి సమాచారం మీ మొబైల్ నందు కనిపిస్తుంది వాటితో పాటుగా ఎమర్జెన్సీ కాల్,ఎమర్జెన్సీ కంప్లైంట్ ఆప్షన్స్ రావడం జరుగుతుందన్నారు. ఎమర్జెన్సీ కాల్ లేదా టెక్స్ట్ రూపంలో స్పందించినప్పుడు పోలీస్ వారు అ యొక్క సమాచారం ఆదారంగా వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీస్ శాఖ ఇతర శాఖలతో సమన్వయంగా పనిచేస్తుందన్నారు. ఇందులో భాగంగా 'సురక్షిత ప్రయాణం' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టి తరచూ ప్రమాదాలు సంభవించే ప్రాంతాలను సందర్శిస్తూ వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదల నివారణలో ఆటో డ్రైవర్లు కూడా భాగస్వాములై ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా మార్చడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ రాములు, ఆర్టీఓ శ్రీనివాస్, మెటపల్లి సీఐ అనిల్ కుమార్, ఎస్ఐలు కిరణ్ కుమార్, రాజు, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, ఓనర్స్ పాల్గొన్నారు.





# మంగళవారం సీక్వెల్‌లో శ్రీలీల?



ఏండేండ్ల కిందట ఆర్ఎక్స్ 100 సినిమాతో సెన్సేషనల్ ఎంట్రీ ఇచ్చిన దర్శకుడు అజయ్ భూపతి. అంచనాలు లేకుండా వచ్చిన ఆ సినిమా బాక్సాఫీస్ దగ్గర సంచలన విజయం సాధించడమే కాకుండా తొలి సినిమాతోనే నటుడు కార్తికేయని స్టార్ హీరోని చేసింది. అయితే ఆ సినిమా అనంతరం అజయ్ భూపతి దర్శకత్వంలో వచ్చిన మహాసముద్రం ఫ్లాప్ అవ్వగా.. చాలా గ్యాప్ తీసుకుని మంగళవారం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. తన లక్కీ హీరోయిన్ పాయల్ రాజ్ పుత్ హీరోయిన్‌గా పెట్టి సినిమా తీశాడు. ప్రియదర్శి ఇందులో కథానాయకుడిగా నటించాడు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ సినిమాకు సీక్వెల్ రాబోతున్నట్లు అజయ్ భూపతి ప్రకటించాడు. ప్రస్తుతం ప్రీ- ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రం త్వరలోనే పట్టాలెక్కబోతున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌లో శ్రీలీల హీరోయిన్ అయితే బాగుంటుందని దర్శకుడు ఆలోచిస్తున్నట్లు సమాచారం. కాగా దీనికి సంబంధించి ప్రస్తుతం వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మొదటి పార్ట్‌లాగే ఇందులో కూడా కథానాయిక గ్రామీణ యువతి పాత్రలో నటించబోతున్నట్లు తెలుస్తుంది. కాగా ఈ ప్రాజెక్ట్ సంబంధించి మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.